క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: మండల పరిధి రంగంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు(సోమవారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రంగంపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా రంగంపల్లి, గడిసింగాపూర్, సుల్తాన్‌పూర్, సొండేపూర్, రూప్‌ఖాన్‌పేట్, మిట్టకోడూర్, గోవిందాపూర్, బాబాపూర్, లక్నాపూర్ గ్రామాలకు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే

కొడంగల్ రూరల్: మంత్రాలయంలోని శ్రీగురు రాఘవేంద్రస్వామిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట దూపదీపనైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి ఉన్నారు.

నేడు పల్లెపల్లెకూ కాంగ్రెస్

మర్పల్లి: నేడు మండలంలో పల్లెపల్లెకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ పార్టీ కొంషేట్‌పల్లి క్లస్టర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రఫియొద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పల్లెపల్లెకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంతో గ్రామాల్లో పర్యటించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపు నిచ్చారు.

చలిపంజా



చలిమంట కాగుతున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట: రెండు రోజులుగా చలిపులి పంజా విసురుతోంది. దీంతో గ్రామాల్లో ఉదయం, సాయంకాలం ప్రజలు చలిమంట కాగుతున్నారు. రోజువారి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం గజగజా వణికిపోతున్నారు. ఉదయం 16డిగ్రీలు, మధ్యాహ్నం 27డిగ్రీలు నమోదవుతున్నాయి. చలి నుంచి తమను తాము కాపాడుకునేందుకు ప్రజలు ఉన్నిదుస్తులు ధరిస్తున్నారు. దీంతో రగ్గులు, ఉలన్ దుస్తుల వ్యాపారం జోరందుకుంది.

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు



గ్రామంలో బోనాల ఊరేగింపు

తాండూరు రూరల్: అంతారంలో మూడు రోజులుగా గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఊరడమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ దీప పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచు రాములు, ఉప సర్పంచు జీవరత్నం, పుల్లా ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఎల్లప్ప, వడ్డె చంద్రప్ప, నక్కల రాజు, మొగులప్ప, ప్రకాశం, నారాయణ, రాజురెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మించినప్పటి నుంచి నిరుపయోగమే..



మదన్‌పల్లిలోని వీఎస్ఎస్ షల్టర్

బొంరాస్‌పేట: మదన్‌పల్లిలో వనసంరక్షణ సమితి(వీఎస్ఎస్) నిధులతో 12 ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌షల్టర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నిర్మించిన నాటి నుంచి నిరుపయోగంగా ఉండటంతో ప్రజాధనం వృథా అయింది. గ్రామంలోని బొంరాస్‌పేట-ధారూరు మండలం నాగారం రోడ్డు పాఠశాల పక్కన నిర్మించిన ఈ బస్‌షల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ధర్నాకు తరలిరావాలి

కొడంగల్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న ధర్నాకు నియోజకవర్గంలోని సర్పంచులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ టీపీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్ కోరారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కోర్టు అనుమతితో శాంతియుతంగా ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆదమరిస్తే అంతే..

ఏ మాత్రం ఏమరు పాటున ఈ దారిలో వాహనం నడిపినా ఇక అంతే సంగతులు! చన్గోముల్-లాల్‌పహాడ్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టులు సగం వరకు కోసుకుపోయి ప్రమాదకరంగా మారాయి. పలుమార్లు ప్రమాదాలు జరిగినా ఆర్అండ్‌బీ అధికారులు కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– పూడూరు



వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

మర్పల్లి: వైద్య శిబిరాన్ని పోలీసు సిబ్బంది సద్వినియోగించుకోవాలని ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఆదివారం ఠాణా ఆవరణలో హెల్త్‌చెకప్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. నిత్యం ఒత్తిడిలో సిబ్బంది.. రోజువారిగా కొంత సమయాన్ని కేటాయించి వ్యాయామం చేయాలని చెప్పారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యాధికారుల సూచనలు పాటించాలన్నారు. ఈ శిబిరంలో 25 మంది సిబ్బందికి డాక్టర్లు వైద్య చికిత్స అందించినట్లు వెల్లడించారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

పట్టించుకోని పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి

యాలాల: ఒక ఊరిని దత్తత తీసుకోవడం అంటే.. అభివృద్ధే కాదు. ప్రతీ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలి. ప్రజా సంక్షేమంతో పాటు.. పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధికి నిరంతరం పాటుపడాలి. అందులో భాగంగానే గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్‌గా ఉన్న సునీతారెడ్డి తిమ్మాయిపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. నాటి నుంచి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రధాన గేటు నుంచి గ్రామం లోపలికి వచ్చే రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. వాటి సంరక్షణ బాధ్యత కోసం ట్రీగార్డులను ఏర్పాటు చేయించారు. ఇలా నాడు నాటిన ఆ మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికీ.. కొందరూ వ్యక్తులు రోడ్డుకిరువైపులా పెరిగిన చెట్లను నరికివేస్తూ.. పర్యావరణ విధ్వంసానికి పాటుపడుతున్నారు. ప్రధాన రోడ్డు పక్కనే ఇదంతా జరుగుతున్నా.. పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం హరిత హారం పేరిట రూ. కోట్లు వెచ్చించి మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటుండగా.. ఇక్కడ మాత్రం అందుకు వ్యతిరేకంగా జరగడం విడ్డూరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇలా ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్న వారిపై పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపక్కన చెట్లు నరకడంతో మిగిలిన మొదళ్లు

‘శివసాగర్’కు మోక్షం!

- మార్చిలో పనులు ప్రారంభం
- పూర్తయిన కాల్వల సర్వే..
- హద్దులను గుర్తించిన ఇరిగేషన్ శాఖ
- ఆశగా ఎదురు చూస్తున్న ఆయకట్టు రైతులు



పూర్తయిన అలుగు ప్రాంతం

యాలాల: విశ్వనాథ్‌పూర్ సమీపంలో కాకరవేణి నదిపై నిర్మిస్తున్న శివసాగర్ ప్రాజెక్టు కాల్వల నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. నూతన సంవత్సరంలో పనులు ప్రారంభం కానున్నాయి. ఇందుకుగాను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నారు. కాల్వల అలైన్‌మెంట్ ఏరియాను గుర్తించి, హద్దులు నిర్ణయించారు. దీంతో 16 ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు, ప్రజల కల నెరవేరనుంది. సాగుకు నీరందనుంది.

2005లో అంకురార్పణ

జలయజ్ఞంలో భాగంగా కాకరవేణి నదిపై విశ్వనాథ్‌పూర్ శివారులో శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 2005 ఆగస్టు 4న నాటి ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అంకురార్పణ చేశారు. ప్రాజెక్టు పది అడుగుల నీటిమట్టం, వెయ్యి ఎకరాల ఆయకట్టుతో ఇక్కడి రైతులకు ఎంతో ఆశపెంచింది. అయితే కాలం గడుస్తున్న కొద్దీ.. పలు కారణాలతో ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పెరిగిన అంచనా వ్యయం

ప్రాజెక్టు కరకట్ట, తూముల నిర్మాణం, అలుగు, కాల్వల నిర్మాణాలు రూ.5 కోట్ల అంచనా వ్యయంతో 2005లో ప్రారంభించారు. నాసిరకమైన పనుల కారణంగా శివసాగర్ ఎడమ కాల్వ తూము ఏడేళ్ల క్రితం వరదలకు కొట్టుకుపోయింది. వరద ఉధృతి కారణంగా అలుగు ప్రాంతం దెబ్బతిని, రెవిట్‌మెంట్, బెడ్లు ధ్వంసమై భూమి కోతకు గురైంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.12 కోట్లకు చేరింది. ప్రస్తుతం అలుగు పని పూర్తి కాగా.. కాల్వలు, తూముల నిర్మాణాలు మిగిలిపోయాయి. ఈ పనులు సైతం ఈ ఏడాదిలో ప్రారంభించి పూర్తి చేసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అలైన్‌మెంట్ కేటాయింపు

ప్రాజెక్టు ఆయకట్టు వెయ్యి ఎకరాలకు పైగా ఉంది. ఆయకట్టు కింద విశ్వనాథ్‌పూర్, యాలాల, గోవిందరావుపేట, సంగెంకుర్దు, రాఘవపూర్, కమాల్‌పూర్, కోకట్ తదితర గ్రామాలకు చెందిన రైతుల భూములు ఉన్నాయి. ఎడమ కాల్వ 4 కిలోమీటర్ల మేర నిర్మించనుండగా, కుడికాల్వ 3 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన అలైన్‌మెంట్ సైతం అధికారులు సిద్ధం చేశారు. కాల్వల నిర్మాణం, గతంలో కొట్టుకుపోయిన తూము పునఃనిర్మాణ పనులతో పాటు కాల్వల నిర్మాణం చేపట్టనున్నారు.

ఈసారైనా పూర్తి చేయాలి



శివసాగర్ ప్రాజెక్టు ఇక్కడి రైతులకు అందని ద్రాక్షలా మారింది. దశాబ్దానికి పైగా నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఆయకట్టు రైతులకు తీరని నిరాశ ఏర్పడింది. ప్రాజెక్టు ఆయకట్టు కింద బోర్ల ద్వారా పంటలు సాగు చేసుకుంటున్నాం. అధికారులు ఈసారైనా కాల్వల పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలి.

– అశోక్, ఆయకట్టు రైతు యాలాల

త్వరలో ప్రారంభిస్తాం



ప్రాజెక్టు ప్రధాన సమస్యే అయినా.. అలుగు, తూము, కాల్వల పనులు పెండింగులో ఉన్నాయి. అలుగు పూర్తయినప్పటికీ.. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొంత మేర దెబ్బతింది. ప్రాజెక్టు నిర్మాణంలో మరో ప్రధాన ఘట్టమైన కాల్వల పనులకుగాను భూసేకరణ దాదాపు వంద శాతం పూర్తయింది. ఇటీవల కాల్వల నిర్మాణ ప్రక్రియ, కాల్వలు నిర్మించే ప్రదేశాలను గుర్తించి హద్దులు కేటాయించాం. మార్చి నుంచి కాల్వల నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని చర్య లు తీసుకుంటున్నాం.

– కిష్టయ్య, డీఈఈ ఇరిగేషన్, తాండూరు

బీజేపీతోనే గిరిజనుల అభివృద్ధి

జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్

యాలాల: బీజేపీతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని తొప్పిర్లగడ్డతండాలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాల్లో మౌలిక వసతులు, ఉపాధి లేక పొరుగు రాష్ట్రాలకు వలస వెళుతున్నారని, గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, నాయకులు పట్టించుకునే స్థితిలో లేదని విమర్శించారు. గిరిజన ఆదివాసీ అయిన ద్రౌపది ముర్మును అత్యున్నత పదవితో బీజేపీ తగిన గుర్తింపు ఇచ్చిందని చెప్పారు. గిరిజనుల అభివృద్ధి బాధ్యత బీజేపీదే అని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్, నాయకులు బంటారం భద్రేశ్వర్, రామ్యనాయక్, విక్రంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.



తండావాసులతో మాట్లాడుతున్న నాయకులు

14న గోదాదేవి కల్యాణోత్సవం

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 14న మధ్యాహ్నం 2 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తెలిపారు. శ్రీవారి ఆలయంలో పద్మావతి పేరుతో ఆరాధించబడుతున్న గోదాదేవి(ఆండాల్) ఉత్సవ మూర్తులకు భోగి రోజున ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4 గంటలకు తిరుచ్చి ఉత్సవం, 15న ఆదివారం మకర సంక్రాంతి ఉత్తరాయన సాయంత్రం 4 గంటలకు శ్రీవారి ఉత్సవం, 16న కనుమ రోజున పద్మావతికి ఉదయం 7 గంటలకు పుష్కరిణి వద్ద అలంకార తిరుమంజనం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.



దేవేరుల సమేత మలయప్ప స్వామి

మైసమ్మకు బోనాలు



పూజలందుకుంటున్న మైసమ్మ తల్లి

పెద్దేముల్: కోట్ల మైసమ్మ తల్లికి భక్తులు బోనమెత్తారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో.. ఊరేగింపుగా భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు.

ఎంపీడీఓ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతగిరి: రాష్ట్ర ఎంపీడీఓల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, సీఈఓ జానకిరెడ్డి, ఎండీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు శర్మ, ప్రదాన కార్యదర్శి శైలజ, పలువురు ఎంపీడీఓలు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్..

టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి రాములు, జమున, మూవీస్, బాబురావు, పవన్‌కుమార్, రత్నం, కృష్ణవేణి, అరవింద్, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

నెలాఖరున వార్షికోత్సవం

కుల్కచర్ల: ఈ నెల 30, 31న ముజాహిద్‌పూర్ గ్రామంలో ఆంజనేయస్వామి వార్షికోత్సవ ఉత్సవాలను జరపాలని గ్రామస్తులు తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. 30న గణపతిపూజ, హోమం, 31న పల్లకీసేవ, స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నామని నిర్వహకులు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఘనంగా కట్టమైసమ్మ జాతర

తాండూరు: మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు కట్ట మైసమ్మ దేవాలయంలో ఆదివారం మైసమ్మ జాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి తెల్లవారు జామున సుప్రభాత సేవ, 5.30 గంటలకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులు అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి అంతప్ప బావి శివాలయం వరకు కౌన్సిలర్ రాఘవేందర్ ఆధ్వర్యంలో భక్తులు పల్లకీ సేవ చేశారు. సాయంత్రం భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాలకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప, కోఆప్షన్ సభ్యుడు సారంగ, నాయకులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారిని దర్శించుకున్న వైస్ చైర్‌పర్సన్ దీప

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దోమ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ అనసూయ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. కావునా అధికారులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మండల పరిధిలోని 56 మంది లబ్ధిదారులకు మధ్యాహ్నం 3.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి రానున్నారని చెప్పారు. కావున లబ్ధిదారులు కార్యక్రమానికి హాజరై చెక్కులు తీసుకోవాలని కోరారు.

చెరుకు సాగు భలే..

- 'పంట'పండుతున్నా కర్మాగారాలు లేక కర్షకుల ఇబ్బంది
- దళారులతో దగాపడుతున్న రైతులు
- నేరుగా విక్రయించని ఫ్యాక్టరీల యాజమాన్యాలు



కొత్తగా చెరుకు నాటుతున్న రైతులు

పెద్దేముల్: జిల్లాలో చెరుకు సాగు పెరుగనుంది. గతంలో 2,200లు ఉన్న చెరుకు ధర నేడు టన్నుకు రూ.3,617కు పెరిగింది. పంటకు అనువైన నేలలు ఉండటంతో రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మూడు దశాబ్దాలుగా అందుబాటులో లేని చెరుకు కర్మాగారాల కోసం ఎదురు చూస్తూనే.. సాగుపై మక్కువ పెంచుకున్నారు. ఏనాటికైనా షుగర్ ఫ్యాక్టరీ కల నెరవేరక పోతుందా అంటూ తీపి పంచుతున్నప్పటికీ.. ఆ కల నెరవేరటం లేదు. రేయింబవళ్లు చెమటోడ్చి పండించిన రైతుకు తీపిని పంచాల్సిన చెరుకు.. ఏటా చేదునే మిగుల్చుతోంది. 12 నెలల పాటు చేసిన కష్టం దళారుల పాలవుతోంది. దీంతో రైతులు అయిష్టంగానే చెరుకు సాగుపై మొగ్గుచూపుతున్నారు.

పొరుగు ప్రాంతాలకు తరలింపు

జిల్లాలోని పెద్దేముల్, బంట్వారం, కోటపల్లి, మర్పల్లి, ధారూర్, తాండూరుతో పాటు పలు మండలాల రైతులు చెరుకు పంటను సాగుచేస్తున్నారు. గతేడాది భారీ వర్షాలకు పంటలు పాడవటంతో ఈ ఏడాది చెరుకు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పదేళ్ల క్రితం జిల్లాల్లో సుమారు 20నుంచి 25వేల ఎకరాల వరకు సాగు ఉండేది. నాలుగేళ్ల నుంచి భారీగా తగ్గింది. ఫ్యాక్టరీలు అందుబాటుల్లో లేక, సరైన సమయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించక పోవటం, కూలీల కొరత ఏర్పడటంతో రైతులు దళారులను ఆశ్రయించ వలసి వచ్చింది. అప్పట్లో పండించిన చెరుకును సంగారెడ్డిల్లోని గణేశ్ ఫ్యాక్టరీ, మహబుబ్‌నగర్ జిల్లాలో కొత్తకోట, కర్ణాటక రాష్ట్రంలో యాద్గీర్ ప్రాంతాలకు తరలించేవారు.

నానాటికీ పెరుగుతున్న వ్యయం

మూడేళ్ల క్రితం టన్నుకు రూ.200 పెరిగిందని, ప్రస్తుతం టన్నుకు రూ.3,617 ధర ఉందని రైతులు అంటున్నారు. నాడు టన్ను చెరుకు కోతకు కూలీలకు రూ.400 ఇవ్వగా.. ప్రస్తుతం రూ.650 చేరుకుంది. ఏటా ఖర్చులు పెరుగుతున్నా.. చెరుకుకు మద్దతు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం టన్నుకు ట్రాన్స్‌పోర్ట్, లేబర్ ఖర్చులు పోను ఫ్యాక్టరీ నుంచి సుమారు రూ.2,400 వరకు వస్తుందని, దానికి బదులు టన్నుకు ప్రభుత్వం రూ.4 వేల నుంచి రూ.4,500 వరకు మద్దతు ధర ఇస్తే పెట్టుబడులు పోను కాస్త లాభం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎరువుల ధరలు పెరిగి మరింత భారంగా మారింది. ఎకరా పొలంలో చెరుకు నాటడానికి సుమారు రూ.30 నుంచి రూ.40వేలు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. విత్తు విత్తినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రెండు సార్లు కలుపు తీయటం, మూడు సార్లు మందులు వేయటం, నీరు పెట్టడం తప్ప ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు చెబుతున్నారు. కోత సమయంలో యంత్రాలు లేదా, కూలీల ద్వారా కోతలు లేకుండా చుడాలి. గతేడాది మండలంలో సుమారు 2వేల ఎకరాలల్లో సాగు ఉండగా.. ఈ ఏడాది సుమారు 3500లకు పెరిగినట్లు తెలుస్తోంది.



రైతు కూలీలు నరికిన చెరుకు

ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



35 ఏళ్ల నుంచి రైతుల గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరుకు ఫ్యాక్టరీలు అందుబాటులో లేక.. తక్కువ ధరకు విక్రయిస్తున్నాం. కొన్నిసార్లు పెట్టుబడులు రావటం లేదు. కర్మాగారాలు సమీపాన ఉంటే.. మండలంలో ప్రతిరైతు సాగు చేస్తారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం వికారాబాద్ ప్రాతంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి.

– రాంచంద్రయ్య, రైతు, బండమిదిపల్లి

దళారీ వ్యవస్థను తొలగించాలి



చెరుకు ఫ్యాక్టరీల యజమానులు రైతుల నుంచి నేరుగా చెరుకు విక్రయించాలి. అవసరం ఉన్నంత వరకు కూలీలను ఏర్పాటు చేయాలి. దళారీ వ్యవస్థను తొలగించాలి. అప్పుడే రైతుకు మద్దతు ధర దక్కుతుంది. ఫ్యాక్టరీల యాజమాన్యం కూలీలను ఏర్పాటు చేయకపోవటంతో.. దళారులు దగా చేస్తున్నారు. టన్నుకు రూ.200 నుంచి రూ.300ల వరకు తగ్గిస్తున్నారు.

– వెంకటరెడ్డి రైతు అడ్కిచెర్ల

పండక్కి ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త

చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు

చేవెళ్ల: పండుగలకు ఊర్లకు వెళ్లే వారు తగిన జాగ్రత్తగా ఉండాలని చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగకు తమతమ ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని, ఊరు వదిలి వెళ్లాల్సి వస్తే మీ విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు తదితర వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని, అదే సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో సీసీ కెమెరాలు బిగించుకొని డీవీఆర్‌ను కనపడకుండా ఇంటిలోపల పెట్టుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సెల్‌ఫోన్‌లో సీసీ కెమెరాల ద్వారా ఇంటిని పరిశీలిస్తుండాలని, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు ఇంటి పరిసరాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళాలను బిగించుకోవడం మంచిదన్నారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని ద్విచక్రవాహనాలకు తప్పనిసరిగా తాళం వేయాలన్నారు. ఇంట్లో లేని సమయంలో ఇంటికి వచ్చే పాలప్యాకెట్లు, న్యూస్‌పేపర్లు వేయకుండా ముందుగానే సమాచారం అందించాలన్నారు. పోలీసులకు సమాచారం ఉంటే ఆ ఏరియాలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు వహించి సహకరించాలన్నారు.